# 17. మట్టి

"నీకు కోదండ రామయ్యగారు తెలుసు కదా;" అని నేను ప్రారంభించగానే రాజశేఖరం: "అబ్బో, ఆయనెక్కడ; రాకాసి పీనుగ! గడ్డిమేటు దగ్గిర కుక్క!" అన్నాడు.

"అంటే, డబ్బు తిండా?"

"అతనా? డబ్బా? తను తిండు; ఒకణ్ణి తిన్నివ్వడు. చెప్పేనుగా, గడ్డిమేటు దగ్గిర కుక్క... ఇంతకీ యేమిటి పని, మనకి అతన్తో?"

నేను ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో కోదండ రామయ్యగారే నన్ను బతికించాలి.

ఇప్పుడు బతకడం లేదా అంటే - బతుకుతున్నాను. కానీ అప్పులూ ఖర్చులూ అనే వ్రణాల్తో ఇదీ ఒక బతుకేనా అని పించేస్తోంది.

ఇంతకన్నా బాగా బతకాలనుకోడం తప్పుకాదు గదా ...

ఇంతకీ నేనెవరికీ అన్యాయం చెయ్యక్ఖర్లేదు.

మా నాన్నగారు రాజకీయ బాధితుడు. క్విట్టిండియా మూమెంట్లో వో మాటూ ఉప్పు సత్యాగ్రహమప్పుడోమాటూ జైలుకెళ్లేరు. ఆస్తంతా కాంగ్రెస్‌కిచ్చేసి మమ్మల్ని సత్రాల పాల్జేసేరు తప్పా ఏ మేలూ చెయ్యలేదు. అందుచేత -

రాజకీయ బాధితులకి భూములిస్తున్నారుట, అప్లికేషను పెట్టండి - పోనీ, యెవర్నయినా ఆశ్రయించి కొంత భూమిసంపాదిస్తే ఏదో ఓ ఫలసాయం తీద్దాం: అని నేనంటే -

ఒరే, నాకు తిండి పెట్టడానికి నీకు బరువైతే ఏ అరవిందాశ్రమానికో సేవాగ్రాంకో వెళిపోతానన్నారు తప్పా నేను చెప్పి నట్టు చైలేదు. చివరికి పోరగా పోరగా పన్నెండేళ్లకిందట ఆయన అప్లికేషను పెట్టేరు గాని అప్పటికే మంచి మంచి బంజరు భూములన్నీ అందరూ పంచేసుకోగా మాకొచ్చిన ఐదెకరాలూ వొట్టి గోతులూ వరకలూ అరణ్యమూ మిగిలింది.

కానీ, టవునికి మరీ అంత దూరంగా లేదు గనక అటూ ఇటూ చూసి ఏ గృహనిర్మాణ సహకార సంఘానికో అమ్మేసుకుంటే ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం దగ్గిర దగ్గిర మూడు లక్షలు రావచ్చునని రెండేళ్లుగా అడ్డమైన వాళ్ల కాళ్లూ పడుతున్నాను. కానీ మా జాగా చూసి ఎవరూ ముందుకి రాడం లేదు. అన్నీ గోతులూ వరకలూనూ. పోనీ నేలంతా చదును చేయిద్దామంటే వరసగా రెణ్ణెల్ల పాటు బుల్ డోజరు పనిచెయ్యాలి. అంటే రోజుకి నాలుగువందల చొప్పున అద్దె, యాభైరూపాయల చొప్పున డ్రయివరు బేటా; మనఖర్చులు యాభై మొత్తం ముప్ఫయివేలు పెట్టుబడి పెట్టాలి. ఎవరైనా కొంటామని ముందుకొచ్చి ఎడ్వాన్సిస్తే తప్ప పెట్టుబడి లేదు. పెట్టుబడి పెట్టి నేల చదును చేస్తే తప్ప బేరం రాదు. పెళ్లికుదిరితేగాని పిచ్చికుదరదు; పిచ్చికుదిరితేగాని పెళ్లికుదరదూ అన్నట్టుంది.

"ఈయన వో హౌస్ బిల్డింగ్ సొసైటీకి ప్రెశిడెంటుకదా; ఆ సొసైటీలో మెంబర్లు కొంచెం

ఎక్కువ మంది అవడంవల్ల రెండెకరాలూ మూడెకరాలూ చాలవుట. మాభూమి అంతా ఒక్కచోట ఏక ఖండికగానూ నల్చదరం గానూ ఉంది కదా. అంచేత మా భూమి అంతా ఆ సొసైటీ చేత కొనిపించి చదును చేయించుకుంటే వాళ్లకీ నాకూ కూడా సుఖం. అక్కడ ఎకరం లక్షరూపాయలకి పైగా వుంది. నాకు అరవై వేలిచ్చినా చాలు. అలా నాకు మూడులక్షలొస్తే నాయిల్లు తణఖా విడిపించుకొని బాగు చేయించుకుందికీ మా చెల్లెళ్ళిద్దరి పెళ్లిళ్లకీ చేసిన అప్పులూ వొడ్డీలూ కట్టేదానికీ సరిపోతుంది. గాజుల బేరం భోజనానికి సరి!"

"సరే, అడుగుదాం పద" అన్నాడు రాజశేఖరం.

✤ ✤ ✤

"డబ్బంటే నాకు మట్టితో సమానం. తెల్సిందా?" ఎవరితోనో అంటూ ఇవతలికొచ్చేరు కోదండ రామయ్యగారు."రాజశేఖరం మీ గురించి నాకంతా చెప్పేడు. మీ నాన్నగార్ని నేను స్వయంగా ఎరుగుదును కూడాను." అన్నారు.

"అది మా అదృష్టం."

"నా సంగతికూడా మీకు మీ ఫ్రెండు చెప్పే ఉంటాడు. రూలంటే రూలే. నాముప్పయి రెండేళ్ల సర్వీసులోనూ ఒక్కసారైనా కూడానూ రూలుకి ఒక్క ఇంచి అటుగాని ఇటుగాని బెసగలేదు. తెల్సిందా?"

"ఆయ"

"మీ భూమి మా సొసైటీకి సమంగా సరిపోతుంది. ప్లాను మీద వర్కవుట్ చేసి చూసుకున్నాం. నాలుగు వందల గజాల జాగాలు ముప్పయి; రెండు వందలేభై గజాల స్థలాలు పదహారు; మాకు కావాలి. ఇవి కాక పార్కు, రోడ్లు సైడు కాలవలు వీటికి మొత్తంలో మూడోవంతు పోతుంది. ఆ విధంగా మీ భూమి నాలుగెకరాలతొంభై ఏడు సెంట్లూ సరిపోయింది. కానీ, భూమి చూసే సరికి నీరు గారిపోయాను. అంతలేసి గోతులూ వరకలూ వున్న భూమి కొనేసి ప్లాట్లు చేసి ఇళ్ళు కట్టేసుకొండర్రా అని సొసైటీ మెంబర్లకి చెప్తే చెప్పుచ్చుకుని దవడపళ్ళు రాలగొడ్తారు. అంచేత ఆ భూమి సదును చేయించి మరీరండి. మీరు ఎకరం అరవై వేలు చెప్తున్నార్ట కదా. భూమి చదును చేయించి వప్పగిస్తే డెబ్భయివేల దాకా ముట్టచెప్పే పూచీ నాది. తెల్సిందా?"

తెల్సింది. తెల్సిందా అని ఆయన అంటే ఆయన మాట అక్కడికి అయినట్టు. మనం మాట్లాడాలన్నమాట.

"తెల్సిందండి. కాని పెట్టుబడుంటే ఇన్నాళ్లెందు కూరుకుంటానండి? ఆ భూమిని ఉన్నదున్నట్టుగా వప్పగించుకుని ఎకరానికి డెబ్భయివేలు కాదండి; అరవై ఇప్పించినా చాలండి. మీ మేలు మరిచిపోనండి." అన్నాను.

"మీరేంటంటున్నారో నాకు తెలిసింది. అదేం కుదర్దు మనదగ్గిర. నేచెప్పానుగా; డబ్బు మట్టితో సమానం, నాకు! తెల్సిందా?"

తెల్సింది. ఇంక ఆయన్తో నేనేం మాట్లాడగల్ను?

✤ ✤ ✤

పది రోజుల తరవాత ఒకనాడు నేను ఆఫీసు నుంచి ఇంటికి వెళిపోతూ వుంటే ఎదుటి వేపునుంచి జీపులో వెళిపోతూ కనిపించేరు కోదండ రామయ్యగారు."నమస్తే" అన్నట్టు నేను కుడి చెయ్యి ఆడించేను.

చూసీ చూడనట్టు వెళిపోయారే అని బాధపడుతూ వెనక్కి తిరిగి చూశాను. అల్లంత దూరాన్ని జీపు ఆగింది. ఆయన జీపుదిగి; రమ్మని నాకు చెయ్యి వూపారు. వెళ్లేను.

"ఏం చేసేరు, మీ భూమిమాట?" అని అడిగేరు "ఏం చెయ్యగల్ను సార్! అశక్తుణ్ణి. ఏదో రొండుపూట్లా ఇంత భోంచేస్తూ చొక్కాలాగూ వేసుకుని తిరుగుతున్నానన్నమాటే గాని భూమి మరమ్మత్ చేయించాలంటే నా వశమా? ఇంతకీ ఘటనుండాలిసార్. ఎప్పుడు సంభవించే విపత్సంతోషాలు అప్పుడు సంభవించక మానవు కదా.''

"తండ్రి గారు రాజకీయవాది. కొడుకు గారు వేదాంతి.'' అన్నారాయన, నా వీపు తట్టి.

"ఆశలు నిరాశలయ్యేక వేదాంతం పుడ్తుంది గాబోలండి.'' అన్నాను.

"అదేం కాదుగానీ, శ్రద్ధగావినండి.'' అన్నారాయన; నడుంమీద చెయ్యేసి నన్ను కొంచెం ఎడంగా లాక్కెళ్లి.

వాళ్ళ బావమరిదిగారు ఢిల్లీనుంచి వచ్చేరుట. చవగ్గా దొరికితే ఓ పదెకరాల భూమి ఇళ్ళస్థలాలకోసం కొనే ప్రయత్నంలో వున్నారుట.

"మీరు రేపు ఆఫీసుకి సెలవుపెట్టేసి పదకొండు గంటలకల్లా మా ఆఫీసుకి రండి. ఆవేళకి అతన్ని కూడా అక్కడికి రమ్మంటాను. వీలుంటే ఓ మాటు జీపులోతీసికెళ్ళి మనసైటు చూపించేద్దాం. అతని కేమాత్రం నచ్చినా రేపే పురోణీ రాసి అడ్వాన్సు పుచ్చీసు కుందురుగాని. అతను ఎల్లుండి బైల్దేరి కాకినాడ వెళ్లి అక్కణ్ణించలా ఢిల్లీ వెళిపోతాడు. పదిహేను రోజుల తరవాత మళ్ళీ మొత్తం క్రైచీటీ డబ్బు పట్టుకొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. తెల్సిందా ?''

"సర్లెండి, ఎలా గయితే అలాగే అవుతుంది. తమరు రమ్మంటే నేను రాకుండా వుండగల్నా? పనికేమిటి, అయితే అవుతుంది, లేకపోతే లేదు. ఒక రోజు సెలవేకదా, దండగ?''

"అదికాదయ్యా వెర్రివాడా, అతనేమో ఆదుర్దాలోవున్నాడు, మీకేమో అవసరం వుంది. అతను బ్లాక్ మనీని వైట్‌చేసుకుందామని చూస్తున్నాడు. నువ్విప్పుడు ఎకరం అరవైవేలూ యాభైవేలూ అంటూ కూర్చోక చక్కగా లక్షరూపాయలు చెప్పు. డెబ్భయివేలిప్పించే ఏర్పాటు నేను చేస్తాను. తెల్సిందా ?''

తెలిసింది. ఆయన అంత సమర్థుడని నాకు ముందే తెలుసు.

✣ ✣ ✣

పదిహేను రోజులు ఇట్టే గడిచిపోయాయి.

నా భూమిని కోదండ రామయ్యగారి బావమరిది గారు తన అక్కగారైన శ్రీమతి కోదండ రామయ్య గారి పేరిట ఎకరానికి అరవై నాలుగు వేల రేటు చొప్పున కొనడానికి వొప్పుకుని, ఇరవై వేలు అడ్వాన్సిచ్చి పురోణీ రాయించుకుని వెళ్లేరు. ఆయన అన్నట్టు ఆ బావమరిదిగారు పదిహేను రోజుల్లో కాదుగాని నలభయ్యయిదు రోజులు గడువు పెట్టుకున్నారు.

పురోణీ రాయించుకున్ననాడు సాయంకాలం కోదండ రామయ్య గారికి చిన్న ఆపద ఒచ్చిపడ్డాది. వాళ్లబ్బాయి అప్పుడెప్పుడో 500 రూపాయలు కట్టి రిజిస్టర్ చేయించుకున్న అదేదో కంపెనీ ది అపురూపమైన స్కూటరు ఆర్రోజు షోరూం కొచ్చింది. వెంటనే ఇరవై వేలు చెల్లించి బండి పట్టుకుపోండి, లేకపోతే ఇంకొహాళకి ఇచ్చేస్తాం అన్నారు షాపువాళ్లు.

పురోణీ డబ్బు ఇరవై వేలు మధ్యాహ్నం మూడు గంటలకి నా చేతికొచ్చింది. వడ్డీ ఎక్కువ రేటు మీద తీసుకున్న అప్పు ఒకటుంది, అది తీర్చెయ్యాలని సిద్ధ పడ్డాను గానీ, శుక్రవారం పూటా డబ్బు ఇచ్చీవొద్దని ఇంట్లో అంటేనూ; పెట్లో పెట్టేను. సాయంకాలం ఐదింటికి కోదండ రామయ్యగారు జీపులో వొచ్చి నాచేత్తో ఆడబ్బు పెట్లోంచి తీయించి నాచేత్తోటే మోటార్ సైకిల్ షాపులో ఇప్పించేసేరు. ఆయన ఆడబ్బసలు ముట్టుకోలేదు. డబ్బంటే మట్టితో సమానం కదా ఆయనకి. చూస్తూ చూస్తూ మట్టిని ఎవరు మాత్రం చేత్తో పట్టుకుంటారు!

పదిహేను రోజులయ్యేక పోనీ ఆడబ్బు ఆయన దగ్గిర తీసుకుని ఒక అప్పుతీర్చాలని ఆయన్ని వెతుక్కుంటూ వెళ్తే ఆయన ఇంటిదగ్గిర లేరు. ఆఫీసులో లేరు. సైటు మీదికి వెళ్లేరని తెలిసి అక్కడి కెళ్లేను.

నా భూమిలో - అదే; ఇంకా నాభూమేమిటి; కోదండ రామయ్యగారి బావమరిది కోదండ రామయ్యగారి భార్య పేర్న కొనుక్కుంటున్న ఆ భూమిలో వరకలూ గోతులూ ఎత్తుపల్లాలూ ఏమీ లేకుండా -

రోజుకి యాభై లారీల చొప్పున మట్టి పోయించి - బుల్‌డోజరుకి, కూలీలకి పన్లు చెప్పి -

భూమంతా చదును చేయిస్తూ అక్కడున్నారు కోదండ రామయ్యగారు.

"ఆగవయ్యా మగడా, నీ డబ్బెక్కడికీ పోదు. చూస్తున్నావుగా, బిజీగా వున్నాను. మా బావమరిది నువ్వన్నట్టు నలభై అయిదు రోజులు తీసుకోట్లేదు. ఎల్లుండే వస్తున్నాడు. నక్కని తొక్కొచ్చేవు. ఎల్లుండి అవతల ఇంకో రోజు, అంతే. మూడు లక్షలు కళ్లజూస్తావు! ఎలాగైనా మీ నాన్నగారు మహనీయుడయ్యా!" ఇలా ఏదో మాట్లాడేరు కోదండ రామయ్యగారు.

రిజిస్ట్రేషన్ నాడు మొత్తం డబ్బులో పురోణీ సొమ్ము మినహాయించుకుని 2లక్షల 98వేల 80 రూపాయలకి డ్రాఫ్ట్ తీసుకుని నాకు రిజిస్ట్రారు ఎదురుగా ఇచ్చేరు. "అంతా ముట్టినట్టేనా?" అన్నారు రిజిస్ట్రార్ గారు. "ముట్టిందండి" అన్నాను. సంతకాలయి పోయాయి.

ఆ తరవాత నెల్లాళ్లకి ఓ నాడు రామక్రిష్ణదాసు కాఫీ హోటల్లో కనిపించేడు. వాడిప్పుడు

అదేదో కంపెనీలో బిజినెస్‌మేనేజరు. వాడూ నేనూ చిన్నప్పుడు ఒకే టీమ్‌లో హాకీ ఆడేవాళ్లం. నేనేమో టీమ్ కెప్టెన్ని. ఓ సారి ఒక మేచ్‌లో మాటీమ్‌కి కార్నర్ షాట్ ఛాన్స్ ఒస్తేనూ, ఒక ఫౌల్‌షాటు కొట్టి గోల్ చేసేడని వాణ్ణి డిబారుకి రికమెండు చేసేన్నేను. "తన్నీ గల్డోరే." అని నాకు వార్నింగిచ్చి వాణ్ణి కంటిన్యూచేసేరు సెలక్షను కమిటీ రాజుగారు.

సర్వీసులో చేరేక అక్కడా ఇక్కడా నౌకరీలో వుండడాన్ని వాడు నన్ను తన్నగలిగినంత దగ్గిర్లో వాడూ లేక నేనూ లేక ఇన్నేళ్లూ గడిచిపోయేయి. అయితే యిప్పుడు కనీకనపడగానే తన్నినంత ఫోర్సుగా పలకరించేసేడు.

"ఆ రిటైర్డ్ డిప్టీ కలెక్టరు కోదండ రామయ్యకి భూమి అమ్మింది నువ్వేట?" అన్నాడు.

'ఆయనక్కాదు, ఆయన బావమరిదికి. ఆ బావమర్ది గారు ఈయన భార్య పేర కొన్నాడు.'

"అదేనోయి. అవ్వపేరే ముసిలమ్మ. అవుతేనూ, ఆ కోదండ రామయ్య నీకేమాత్రానికి వేసేడు టోపీ?"

బహుశా కోదండ రామయ్యగారు నా చేత ఆరోజు మోటార్ సైకిల్ షాపులో ఇప్పించిన ఇరవైవేలూ తిరిగి ఇంక ఇవ్వకపోవచ్చునని నాకు తట్టింది గాని; ఈ కూపీలన్నీ వీడికెందుకూ అనిపించింది.

"ఏం, నీకేమైనా వేసేడేమిటి, టోపీ?" అన్నాను.

వాడికి సిగ్గా ఎగ్గా? "నాకు టోపీ వెయ్యబట్టేకదా, నిన్నడుగుతున్నాను!" అన్నాడు; తనే ఆయనకి టోపీ వేసినంత యిదిగాను.

"నువ్వేమనుకుని మాట్లాడుతున్నావోగాని, కోదండ రామయ్యగారు సత్పురుషుడు. డబ్బంటే ఆయనకి మట్టితో సమానం!" అన్నాను.

"ఓహోహోహో!" అని పగలబడినవ్వేడు రామక్రిష్ణ దాసు గాడు." ఏం యిలవైన మాటలింట న్నాం!" అని కూడా అన్నాడు.

ఆతరవాత వాడు చెప్పి కథవిని నేను తెల్లాతి తెల్ల బోయేను.

వీడు పనిచేస్తున్న ఫ్లోట్సమ్ అండ్ జెట్సమ్ కంపెనీ భూమిని కోదండ రామయ్యగారు చీఫ్ అడ్వయిజరుగా పనిచేస్తున్న ప్రయివేటు కంపెనీ వాళ్లు లీజుకి తీసుకున్నారు. మాకు మరికొంత భూమి కావాలని కోదండ రామయ్యగారి కంపెనీ అడిగింది. వాళ్లేమో మాగ్గిర ఇంక భూమి లేదన్నారు. ఐతే మీరు మాకు లీజుకిచ్చిన భూమిలో ఓ మట్టిగుట్టఉంది కదా, అది కొట్టేస్తాం ఆ విధంగా ఏర్పడే భూమి ఇవ్వండన్నారు వీళ్ళు. సరే అలాగే కొట్టీయండి అన్నారు వాళ్లు. మట్టిగుట్టని కొట్టేస్తే వచ్చే రెండులక్షల ఘనపు మీటర్ల మట్టిని ఎక్కడ పారబొయ్యాలో ఆ జాగా చూపించడానికి పదివేలు సంప్రదింపులకోసం ఫీజు వాసూలు చేసి దానికి రామక్రిష్ణదాసు చేత నోటు పెట్టించేట్ట. ఆ మట్టే నేనమ్మిన భూమిలో పడ్డాది.

ఆతరవాత దాన్ని చదునుచేయించి, నాదగ్గిర ఎకరం అరవైనాలుగువేలకి కొన్న భూమిని ఎకరం లక్షరూపాయలచొప్పున ఆయన ప్రెసిడెంటుగా వున్న సొసైటీకి అమ్మించుకున్నాడు.

ఇలాగ, నాదగ్గిర ఇరవై వేలు, దాసుగాడి కంపెనీ దగ్గిర పదివేలు, సొసైటీ దగ్గిర లక్షా ఎనభైవేలు; మొత్తం రెండులక్షల పదివేలు తనచేతికి మట్టి అంటకుండా లాగేడు కోదండ రామయ్యగారు. కోదండ రామయ్యగారికి డబ్బంటే మట్టితో సమానం. అంచేత మట్టిఅంటే డబ్బుతో సమానమే కదా, మరి! ☼

*("జ్యోతి" మాసపత్రిక : దీపావళి 1974)*

With best compliments from:

Mill : 24910
Res :22910

**SUVEERA TRADERS**

**Prop : N.V.S.V. Prasada Rao**
**Gandhi Nagar, Eluru-534 002, W.G.Dt. (A.P.)**

Mill : 31706
Res: 30585

**Sri Ramana Traders**

*Managing Partner :*
**Nalam Ramakrishna Prasada Rao**
C/o Sri Geetanjali Rice Mill
Gun Bazar, ELURU - 534 005
W.G.Dist. (A.P.) India